# మల్లాది వెంకటకృష్ణమూర్తి మరణ వాఙ్మూలం

**ఆ సిగార్ ఆఖరు దమ్ము లాగి, దాన్ని యాష్ ట్రేలో ఆర్పి పడేసి చెప్పాను - "జడ్జిలు కూడా మానవ బలహీనత లున్న మామూలు మనుషులే తప్ప, దివి నుంచి భువికి దిగి వచ్చిన దేవతలు కారు!"**

"జాతి ప్రేమ." - అంత దాకా ఏలేరు స్కామ్, కరీంనగర్ స్కామ్‌లకి బాధ్యులైన జడ్జిలని ఘాటుగా విమర్శిస్తున్న శివనాథం నా ఖండన విని చెప్పాడు. అతను చార్టెర్డ్ అకౌంటెంట్.

అత నా మాట అనడానికి కారణం నేను రిటైర్డ్ జడ్జి అవడమే.

"జాతి ప్రేమ కాదు, నిజం. న్యాయస్థానానికి సంబంధించిన వారు మామూలు జనం కన్నా మిన్నగా ఉండాలని, న్యాయంగా వ్యవహరించాలని. అలా వ్యవరిస్తారన్నది ఓ మిథ్య. అది మీతో అని అర్థం చేసుకోనప్పుడే ఇలాంటివి షాకింగ్ న్యూస్ లవుతాయి. ఉస్మానియా హాస్పిటల్ లో ఓ డాక్టర్ రోగి దగ్గర లంచం పుచ్చుకుంటూ పట్టుబడితే అది మామూలు వార్త అవుతుంది. డాక్టర్ న్యాయంగా ప్రవర్తించాలని ఎవ్వరం అనుకోం కాబట్టి. అదే, ఓ జడ్జి నిందితుడి నుంచి లంచం తీసుకుని అతన్ని విడిచిపెడితే సంచలన వార్త అవుతుంది. కోర్టులో అలా జరగదని, జరగ కూడదన్న మన నమ్మకాన్ని వమ్ము చేసే వార్త కాబట్టి ఈ తేడా. అక్కడ డాక్టర్‌కి లంచం ఇచ్చుకోలేని పక్షంలో ఆ రోగి మరణించ వచ్చు. కానీ అది మామూలు వార్త. ఇక్కడ ముద్దాయి లంచం ఇచ్చుకోక పోతే మూడు నెలల ఖైదు పడ వచ్చు. అయినా ఇది హెడ్ లైన్స్ వార్త!"

వాయులింగం తన పైప్‌లో పొగాకు నింపుకుంటూ నేను చెప్పిన వాదాన్ని విన్నాడు. దాన్ని వెలిగించుకున్నాక చెప్పాడు నాతో -

'నువ్వు చెప్పినదాంట్లో నిజం ఉంది. న్యాయవ్యవస్థ ఇంత దాకా లంచాలకి అతీతంగా ఉందని మన నమ్మిక. అదే ఉస్మానియా హాస్పిటల్‌లా, పోలీసు వ్యవస్థలా భ్రష్టు పట్టిందన్న సత్యం సమాజం గ్రహించాక ఆ షాక్‌ని, సెన్సేషన్‌ని పత్రికలు కానీ, పాఠకులు కానీ ఫీలవరు. అప్పుడు కోర్టు అధీనంలోని అక్రమ మద్యాన్ని జడ్జి అమ్ముకున్నా ఆ వార్తని ఆవులిస్తూనే చదువుతారు.'

వాయులింగం మా ముగ్గురిలో సెన్సిబుల్ అని నా ఉద్దేశం. ఆయన పారిశ్రామిక వేత్త. ఏ విషయా న్నయినా అన్ని కోణాల నుంచి క్షుణ్ణంగా పరిశీలించి చివర్లో తన అభిప్రాయాన్ని చెప్తాడు. అది చక్కటి జడ్జిమెంట్‌లా ఉంటుందని ఎన్నో సార్లు ఆయనతో అన్నాను కూడా.

"యు సెడ్ ఇట్ రైట్!" చెప్పాను.

"నో! ఐ పుట్ ఇట్ రైట్" నవ్వాడు వాయులింగం.

శివనాథం వంక చూశాను నీ అభిప్రాయం ఏమి టన్నట్లుగా.

'పోలీసులు, న్యాయస్థానానికి సంబంధించిన వారిలో ఎవరు లంచానికి ఆశపడ్డా వ్యవస్థకే లోపం అవుతుంది. డాక్టర్లు, సివిల్ సప్లయ్ అథారిటీ వాళ్ల లాంటి వాళ్ల వల్ల వ్యవస్థ అంతగా దెబ్బ తినదు.'

"నిజమే. పోలీసులు, న్యాయస్థానాల వాళ్లు లంచాలు మరిగితే గూండాలు, నేరస్థులు పెరుగుతారు. అది సమాజ శ్రేయస్సుకి మంచిది కాదు. డాక్టర్ల లాంటి వాళ్ల వల్ల వ్యక్తులు ఇబ్బంది పడతారు. కానీ అన్ లాపుల్ ఎలిమెంట్స్ అభివృద్ధి కావు" చెప్పాడు వాయులింగం.

శివనాథం నా వంక చూసి అడిగాడు సీరియస్‌గా చూస్తే, "నీవు జడ్జిగా రిటైర్ అయ్యావు కదా! నీ కెరీర్‌లో ను వ్వెన్నడైనా లంచం తీసుకున్నావా?"




"అతను లంచం తీసుకునే వాడా, కాదా? నీ అభిప్రాయం చెప్పు ముందు'' అడిగాడు వాయులింగం నవ్వుతూ శివనాథాన్ని.

"వాడు నాకు పదహారేళ్లుగా పరిచయం. అలా పదవిని దుర్వినియోగం చేయడం వాడికి చేత కాదని నా ఉద్దేశం.'' చెప్పాడు శివనాథం.

వాయులింగం నన్ను ప్రశ్నించాడు - 'ఎగ్రీడ్?'

నాకు వెంటనే సభాకర్‌రావు గుర్తొచ్చాడు. సభాకర్ కొడుకు ఆదిత్య గుర్తొచ్చాడు.



"ఎగ్రీడ్ ఆర్ నాట్?" అడిగాడు శివనాథం నా మొహంలోని తడబాటుని గుర్తుంచి.

"ఐ యామ్ అఫ్రైడ్ నాట్!" జవాబు చెప్పాను.

శివనాథం కనుబొమలు పైకి లేచాయి. వాయులింగం కొన్ని క్షణాలు పైపు పీల్చడం ఆపి, మళ్లీ యథాప్రకారం పీల్చసాగాడు.

"అంటే?" అడిగాడు శివనాథం.

"లంచం తీసుకో లేదు కానీ, నా బాధ్యతని ఓసారి జడ్జిగా నేను దుర్వినియోగం చేశాను."

"అది మంచి కారణం కోసమే అయి ఉండాలి, అవునా?" అడిగాడు వాయులింగం.

నా భుజా లెగరేసి చెప్పాను - "అది నిర్ణయించాల్సింది విన్నాక నీవు కానీ, నేను కాదు. ఇంతదాకా ఈ విషయం ఎవరితో చెప్పలేదు నేను. నా భార్యతో కూడా!"

శివనాథం వెయిటర్‌ని పిలిచి మా క్లబ్ ఆర్డర్ బుక్‌లో మూడు లార్జ్ మేన్షన్ హౌస్ బ్రాందీ, రెండు సోడా అని రాసి సంతకం చేశాడు.

నే నది అందుకుని, రెండు చికెన్ టిక్కాలు రాసి సంతకం చేశాను. వాయులింగం రెండు సిగార్‌లు, ఓ అర పాకెట్ శివనాథం తాగే బ్రాండ్ సిగరెట్ పాకెట్ రాసి సంతకం చేశాడు.

"చెప్పు, మిత్రమా? రేపిస్ట్‌ని విడుదల చేశావా, హంతకుడిని నిరపరాధిగా వదిలేశావా, లేక బాంకు దొంగని ఇంటికి పంపావా?" అడిగాడు శివనాథం - ఆఖరి సిగరెట్‌ని వెలిగించి, ఖాళీ పాకెట్‌ని నేల మీద పడేస్తూ.

కొద్ది క్షణాలు ఎక్కడ నుంచి మొదలుపెట్టాలా అని కళ్లు మూసుకుని ఆలోచించాను. తర్వాత సిగార్‌ని పెదాల మధ్య ఉంచుకున్నాను. వాయులింగం దాన్ని అంటించాడు. ఓ సారి పొగ పీల్చి వదిలి చెప్పసాగాను.

"నేను చేసిన దాంట్లో ఎలాంటి స్వార్థం లేదు. ఆ రోజు రాత్రి ..."

చిచిచి

సభాకర్‌రావు కోనసీమలోని ఓ కామందు. అతనికి ఇద్దరు భార్యలు. వారిద్దరి ద్వారా ఇద్దరు కొడుకులు. పెద్ద కొడుకు తండ్రి మాట విని బుద్ధిగా చదువుకుని డాక్టర్ అయ్యాడు. ఆ ఊళ్లో ఓ నర్సింగ్ హోమ్ మొదలుపెట్టాడు.

చదువు అబ్బని రెండో భార్య కొడుకు తండ్రి పొలం పనులు చేస్తూ, కొబ్బరి తోటల మీద అజమాయిషీ చేస్తూ అందులోని మెలకువలను నేర్చుకున్నాడు. ఇద్దరి సంపాదనా దాదాపుగా సమానంగా ఉండేది. ఉమ్మడి కుటుంబ వ్యవస్థని కొనసాగిస్తున్నారు వాళ్లు.

ఇద్దరికీ తండ్రంటే గౌరవం, భయం. ఆయన మాటకి ఎదురు చెప్పే వారు కారు. వాళ్ల గ్రామానికి పది కిలోమీటర్ల దూరంలో గోదావరి. అది పడవ మీద దాటితే యానాం. ఆ ఇద్దరి స్కూలు చదువు యానంలోనే. రోజూ లాంచ్ మీద వెళ్లి చదువుకునే వారు.

యానాంలో ఫ్రెంచ్ వాళ్లు కట్టిన చర్చి ఉంది. దానికి సమీపంలోనే ఫ్రెడరిక్ ఇల్లుంది. ఫ్రెంచ్‌వాడే అయినా, అతని తండ్రి మిగిలిన ఫ్రెంచ్‌వాళ్లలా తమ దేశానికి వెళ్లకుండా యానాంలోనే స్థిరపడిపోయాడు.

ఫ్రెడరిక్ కూడా ఫ్రాన్స్‌కి వెళ్లే ఆలోచన ఎన్నడూ చేయలేదు. భారత పౌరసత్వం తీసుకున్నాడు - ఫ్రెంచ్ పౌరసత్వం ఉంచుకునే ఛాయిస్ ఉన్నా. అతను యానాంనే తన సొంత ఊరుగా భావించడం అందుకు కారణం.

ఫ్రెడరిక్ ఏకైక కూతురు జేన్. సభాకర్‌రావు కొడుకులతో పాటు వాళ్ల స్కూల్‌లో, వాళ్ల క్లాసులోనే చదివేది జేన్. తెల్లగా, పిల్లి కళ్లతో, బంగారు రంగు జుట్టుతో మిగిలిన ఆడపిల్లల కన్నా భిన్నంగా ఉండడంతో మగపిల్లలంతా జేన్ స్నేహం కోరుకునే వారు. వాళ్లిద్దరూ కూడా!

జేన్ స్వతహాగా తెలివి గల పిల్ల. తమ క్లాసులోనే కాక, తమ స్కూల్ మొత్తంలో డబ్బున్న వాళ్లు సభాకర్‌రావు పిల్లలే అని తెలిశాక, ఆ ఇద్దరితో మిగిలిన వాళ్ల కన్నా స్నేహంగా ఉండేది.


సభాకర్‌రావు పెద్ద కొడుకు సూర్య. రెండో కొడుకు ఆదిత్య. సూర్య కాకినాడ పి.ఆర్. కాలేజీలో చేరాడు. అతను గోదావరి దాటి, యానాంలో బస్సెక్కి కాకినాడకి వెళ్లి కాలేజీలో చదువుకుని రాత్రికి తిరిగి ఇంటికి వెళ్లే వాడు. దారిలో ఉన్న యానాంలో కాలేజీ నుంచి తిరిగి వెడుతూ జేన్‌ని కలిసే వాడు. సూర్యకి అప్పటికే వివాహం అయినా, ఆ సంగతి జేన్‌కి తెలిసినా ఆమె పట్టించుకో లేదు. చర్చి వెనుక ఉన్న మెట్లెక్కి, చర్చి వెనుక టాప్ మీద రహస్యంగా కలుసుకుని గడిపేవారు. అది ఆ ఊళ్లో లవర్స్ పార్క్ లాంటిది.

ఎం.బి.బి.ఎస్. చదవడానికి సూర్య హైదరాబాదు వెళ్లిపోయాక జేన్ ఆదిత్యని కవ్వించింది. పెళ్లయిన ఆదిత్యకి తన అన్నయ్యకి, జేన్‌కి గల అక్రమ సంబంధం గురించి తెలియదు. జేన్ అది దాచిపెట్టింది. ఆదిత్యకి అప్పటికే వివాహం అయింది కానీ, ఇంకా వయసు రాలేదని ఆమెను కాపురానికి పంపలేదు ఆదిత్య మామగారు.

ఉదయం నుంచి చీకటి పడే దాకా కొబ్బరి తోటల్లో, పొలం పనులతో అలసి పోయిన ఆదిత్య యానాంకి సినిమాకని చెప్పి వచ్చి, అవే మెట్లెక్కి, అదే చర్చి టాప్‌మీద జేన్‌తో గడిపే వాడు. తన అన్న సరిగ్గా అక్కడ ఆమెతో అదే పని చేశాడని తెలిస్తే అత నేం చేసే వాడో కానీ, ఆ సంగతి ఆదిత్యకి తెలియదు.

సూర్య ఎం.బి.బి.ఎస్. చదువై ఇంటికి తిరిగి వచ్చే వరకు ఈ భాగోతం సాగింది. సూర్య ఈ లోగా సెలవులకి వచ్చినప్పుడు జేన్‌ని అతను పూర్వంలాగా కలిస్తే, ఆ సమయంలో ఆదిత్య రాకుండా జాగ్రత్త పడేది జేన్.

ఎం.బి.బి.ఎస్. అయ్యాక సభాకర్‌రావు తన కొడుక్కి తమ ఊళ్లో ఓ నర్సింగ్ హోమ్ కట్టించి ఇచ్చాడు. జేన్ ఆ ఇద్దరినీ ఒకరి గురించి మరొకరికి



తెలియకుండా కొంత కాలం మేనేజ్ చేసింది, ఎంతో తెలివిగా.

అగ్నిపర్వతం బద్ద లైనట్లుగా ఆదిత్య కా రహస్యం కళ్లారా చూడడంతో తెలిసింది క్రిస్టమస్‌కి ముందు రోజు. చప్పుడు చేయకుండా వెనక్కి వచ్చేశాడు. ఆ విషయం జేన్‌తో మర్నాడు ప్రస్తావిస్తే ఆమె తేలిగ్గా తప్పుకుంది. తను ఆదిత్యని ప్రేమిస్తున్నానని చెప్పినా వినకుండా గత మూడు నెలలుగా తనని సూర్య లొంగ తీసుకుంటున్నాడని, అన్నదమ్ముల మధ్య పొరపొచ్చాలు రాకూడదని తను ఆ విషయం ఆదిత్యకి చెప్ప లేదన్ని అబద్ధం ఆడింది.

ఆదిత్య ఇలాంటి సందర్భంలా అన్నని నిలదీసే స్వభావం కల వాడు కాదు. అయితే అతను జేన్‌తో ఒక్క శారీరకంగానే కాక ఎమోషనల్‌గా కూడా ఇన్‌వాల్వ్ అయి ఉండడంతో, అన్న మీద స్వతహాగా గల గౌరవంతో ప్రశ్నించకుండా సతమత మయ్యాడు. జేన్ తన సొంతం అని సూర్యకి చేప్పేంత ధైర్యం లేదు అతనికి. అలాగని చేతులు ముడుచుకుని కూర్చోనూ లేడు.

డాక్టర్‌గిరితో బిజీ అయిన సూర్య నర్సింగ్ హోమ్‌కి జేన్ రోగిగా వచ్చి ఒక సారి రాత్రంతా కూడా ప్రైవేట్ రూమ్‌లో గడిపేసేది. ఆదిత్య మానసికక్షోభ రాను రానూ అధిక మైంది.

ఎంతటి మంచి వాడు కూడా మనసు అగ్నిపర్వతంలా మండితే ఊరుకోలేడు. ఫలితంగా ఓ రోజు ఆపుకోలేని ఉద్రేకంతో, క్రోధంతో జేన్‌ని నరికి చంప బోయాడు. ఆ సమయంలో ఆమెకి అడ్డొచ్చిన సూర్యని అడ్డు తప్పుకోమని ఎంత వారించినా అతను ఆ పని చేయ లేదు. ఫలితంగా సూర్య మెడ చర్బి ఆవరణలో తెగి పడింది. జేన్ పారిపోయింది. ఆదిత్య యానాం పోలీసులకి లొంగిపోయాడు. యానం కోర్టు ఆ కేసు విచారించి ఆదిత్యంకి యావజ్జీవ కారాగార శిక్ష విధించింది.

శిచిచిచి

నేను చెప్పేది మొత్తం విన్నాక అడిగాడు శివనాథం - "ఆ శిక్ష విధించింది నువ్వేనా?"

"కాదు, నా పాత్ర ఆ సంఘటన జరిగిన నాలుగేళ్లకి ప్రవేశించింది" చెప్పాను.

"ఎలా?" అడిగాడు వాయులింగం.

"నాలాగే సభాకర్‌రావు కూడా సిగార్ ప్రియుడు. లంక పొగాకుని చుట్టలుగా చుట్టి నాకే బహుమతిగా పంపే వాడు. ఈస్ట్ గోదావరి జిల్లా హెడ్ క్వార్టర్స్‌లోని ఓ క్లబ్‌లో ఆయన మెంబరు. ప్రతి శనివారం రాత్రి ఆయన క్లబ్‌కి వస్తూండేవాడు. అర్ధ రాత్రిదాకా విపరీతంగా తాగే వాడు. మళ్లీ శనివారం రాత్రి దాకా మద్యం జోలికి పోయే వాడు కాదు."

"మద్యం మత్తులో జరిగింది చెప్పాడా?" అడిగాడు శివనాథం.

నేను తల అడ్డంగా ఊపి చెప్పాను - "కాదు. అసలాయన ఆ ప్రసక్తే తెచ్చేవాడు కాదు, ఎంత తాగినా. మిగిలిన సభ్యులు చెప్పారు ఆయనంత తాగడానికి గల కారణం. ఆదిత్య జైలుకి వెళ్లక మునుపు ఆయ నసలు మద్యం ముట్టుకునే వాడే కాడట!"

"తర్వాత?" అడిగాడు వాయులింగం ఆసక్తిగా.

నేను ఆరిపోయిన సిగార్‌ని మళ్లీ అంటించుకుని, రెండు దమ్ములు లాగి తిరిగి చెప్ప నారంభించాను.

"సభాకర్ పెద్ద కొడుకు సూర్యకి పిల్లలు లేరు. సభాకర్‌కి ఆ విషయం ఎంతో మనస్తాపంగా ఉండేది. కొడుకు జైల్లో ఉన్నాడన్న బాధ కన్నా తన వంశానికి వారసులు లేకుండా పోయారన్న బాధ అధికంగా ఉండే దాయనలో.

"దత్తత తీసుకోమని తన కోడళ్లకి సలహా ఇచ్చాడు కానీ, అందుకు వారు ఒప్పుకోలేదు. అనుకోకుండా నాకు హైకోర్టు జడ్జిగా ప్రమోషన్ లభించింది. ఆ శనివారం రాత్రి మా క్లబ్‌లోని అంది మిల్లు నా అకౌంట్‌కి కలపమని కోరాను మేనేజర్‌ని. సభాకర్‌రావు నాకు ప్రమోషన్ వచ్చినందుకు ఎంతో సంతోషించాడు.

"ఇంకో రెండు రోజుల్లో నేను హైదరాబాదుకి వెళ్లేరైలు ఎక్కుతా ననగా నాకు లోకల్ గవర్నమెంట్ హాస్పిటల్ నుంచి కబురు వచ్చింది - సభాకర్‌రావు గుండె పోటుతో హాస్పిటల్‌లో అడ్మిట్ అయ్యాడని. వెంటనే హాస్పిటల్‌లోని స్పెషల్ రూమ్‌లో ఆయన్ని కలిశాను. ఎంతో నీరసంగా ఉన్నాడు. వెంటనే ఓ ఇంజెక్షన్ ఇస్తే కానీ ప్రమాదం గట్టెక్కదని, దాని ఖరీదు మూడు వేల రూపాయలని, అది అ ఊళ్లో దొరక లేదని, కాకినాడకి దాని కోసం మనిషిని పంపామని చెప్పాడు డాక్టర్. అంతా దానికోసం ఆత్రంగా ఎదురు చూస్తున్నాం. ఆయన్ని డాక్టర్లు మాట్లాడవద్దని వారించినా వినకుండా ఆదిత్య గురించి మొదటి సారిగా మాట్లాడాడు. తను అతన్ని ఎంతగా మిస్ అవుతున్నాడో చెప్పాడు. అందరినీ బయటికి పంపించి నాతో ఒంటరిగా మాట్లాడాడు కొన్ని విషయాలు. మాట్లాడుతూండగానే ఆయన మాసివ్ హార్ట్ ఎటాక్‌తో నా కళ్ల ముందే మరణించాడు. అయితే


## ఉత్తర భారత యాత్రలు

| | Tour | Frequency | Fare Rs. |
| --- | --- | --- | --- |
| 1. | Delhi - Shimla - Kulu - Manali - Chandigarh - Delhi | Every Friday | 2,000/- |
| 2. | Delhi - Agra - Jaipur - Delhi (Golden Triangle Tour) | Mon/Wed/Fri (Non-AC) / (AC) | 600/- / 800/- |
| 3. | Delhi - Jaipur - Ajmer - Pushkar - Fatehpur Sikri-Agra - Mathura - Brindavan - Delhi | Every Monday (Non-AC) / (AC) | 800/- / 1,000/- |
| 4. | Delhi - Mussorie - Haridwar - Rishikesh - Delhi | Tue/Fri | 500/- |

Fare includes Dormitory accommodation, transport and guide services. We are running, approved LTC tours for Central Government employees. All tours are by Super Deluxe buses, starting from our New Delhi office. LUCKY WINNERS TRAVELLING IN OUR BUSES WILL RECEIVE PRIZES AND MADRAS - SINGAPORE - MADRAS AIR TICKET. Contact our offices at Bangalore Ph : 2262633, Madras Ph : 564864, Vijayawada Ph : 62227, Visakhapatnam Ph : 545565, Bombay Ph. 2624560 for advance reservations. మీరు ఢిల్లీ వచ్చినపుడు ఆధునాతన సౌకర్యములతో నిర్మింపబడిన 100 రూములు గల "హోటల్ సదరన్" లో బస చేయండి. ఢిల్లీలో రుచికరమైన గోంగూర, ఆవకాయ పచ్చళ్ళతో తెలుగు భోజనం మా హోటల్లోని అమరావతి / సుప్రభాత్ రెస్టారెంట్లలో లభించును.

**HOTEL SOUTHERN/SOUTHERN TRAVELS (P) LTD.**

(Recognised by Department of Tourism Govt. of India)

ఢిల్లీలోని తెలుగు వారి ప్రముఖ వాణిజ్య సంస్థ

18/2, Arya Samaj Road, Karol Bagh, New Delhi - 5, Phones : 5782932, 5739508 Fax : 011-5751308,

Hotel Ayodhya Building, Lakdi-ka-pul, Hyderabad - 500 004. Phones : 227233, 223658.

చెప్పాల్సిందంతా పూర్తిగా చెప్పేశాడు."

వాయులింగం అది కథ విన్నట్లుగా విన్నాడు కానీ, శివనాథం కళ్లలో మాత్రం బాధ కనిపించింది. అతను సిగరెట్‌ని అంటించాడు.

"మర్నాడు నేను కోర్టులో అఫిడవిట్ సబ్‌మిట్ చేశాను. మరణించ బోయే ముందు జడ్జి కెపాసిటీలో నా ముందు ఆయన జరిగింది వివరించారని, జేన్‌కి తన ఇద్దరు కొడుకులతో సంబంధం ఉందన్న నిజం తెలియగానే ఆవేశం పట్టలేక తనే జేన్‌ని మాట్లాడాలని చర్చికి పిలిపించి చంపబోతే, సూర్య ఆమె మీద పిచ్చి ప్రేమతో అడ్డు వచ్చాడని, దాంతో కోపం పట్టలేక సూర్యని తనే నరికి చంపేశానని, ఈ నేరం ఆదిత్య తన మీద వేసు కుని త్యాగబుద్ధితో నేరస్థుడుగా శిక్ష అనుభవిస్తున్నాడని, మరణించబోయే ముందు తన కన్‌సెషన్‌ని రికార్డు చేసుకోమని కోరాడని ఆ అఫిడవిట్‌లో పేర్కొన్నాను. మర్నాడు దినపత్రికల్లో అదో సంచలన వార్త అయింది. తూర్పు గోదావరి జిల్లా అంతా, కోనసీమ ప్రాంత మంతా అట్టుడికిపోయిన ట్లయింది ఈ వార్తతో."

నేను సిగార్‌ని యాష్ ట్రేలో పడేసి మళ్లీ చెప్పాను - "మన చట్టంలో మరణ వాజ్‌మూలానికి ఎంతో విలువ ఉంది. నేరస్థుడే స్వయంగా జరిగింది ఒప్పుకోవడంతో ఆదిత్యకి విధించిన శిక్షను రద్దు చేసి అతన్ని నిర్దోషిగా విడుదల చేశారు. బతికి ఉంటే అతను తన తండ్రి నుంచి నష్టపరిహారం కేసు వేసి గెలిచి ఉండేవాడు, తను అనవసరంగా శిక్ష అనుభవించినందుకు."

"నా కో అనుమానం - సొంత కొడుకు జైలు పా లవుతుంటే ఏ తండ్రీ అలా చూస్తూ ఊరుకోడుగా?" చెప్పాడు శివనాథం.

"మోతుబరి రైతులకి జిల్లాల్లో పేరు ప్రఖ్యాతులు ముఖ్యం. వాటిని కాపాడుకోవడం వాళ్ల ప్రాథమిక హక్కుగా భావిస్తారు. అది కన్న ప్రేమ కన్నా బలమైంది. ముఖ్యంగా సభాకర్‌రావు విషయంలో."

"ఆదిత్య కోర్టులో తండ్రి పేరు బయటపెట్టలేదా?"

"లేదు. తండ్రి చంపాలనుకున్నది జేన్‌ని. కానీ, చంపింది సూర్యని. కన్న తండ్రి హత్య చేస్తే , ఆ నెపం అతను తన మీద వేసుకోడానికి కారణాలు రెండు. ఒకటి - ఆయన పేరు బద్‌నామ్ కాకుండా చూడటం. రెండు : బయట ఉన్నా, ఇక జేన్‌ని కలవడానికి మనస్కరించక ఓ విధమైన విరక్తితో జైలు జీవనం మంచిదనుకోవడం" వాయులింగం తన విశ్లేషణని వివరించాడు.

ఇద్దరూ కొద్ది సేపు మౌనంగా ఉన్నారు. తర్వాత చటుక్కున అడిగాడు వాయులింగం "ఇందులో జడ్జిగా నువ్వు నీ డ్యూటీని అతిక్రమించి చేసిం దేముంది?"

నేను బ్రాందీ ఓ గుక్క తాగి చెప్పాను - "సభాకర్‌రావు నాకు తనే ఆ హత్య చేశాడని చెప్ప లేదు."

శివనాథం కనుబొమలతో పాటు ఈసారి వాయులింగం కనుబొమలు కూడా ఆశ్చర్యంగా పైకి లేచాయి.

"అదే నే నల్లిన కట్టుకథ. జైల్లోని ఆదిత్యని విడిపించడానికి నా కట్టు కథ పని చేస్తుందని నమ్మి అది అల్లాను. అది ఫలించింది."

"ఓఁ, అందుకు నీకు మొత్తం ఎంత ముట్టింది?' ' అడిగాడు శివనాథం.

"పైసా కూడా ముట్టలేదు. డబ్బు కోసం నే నా సాహసం చేయలేదు. సభాకర్‌రావు వంశం నిలబెట్టడానికి, ఆదిత్య తిరిగి తన భార్యతో కాపురం చేయడానికి ఆ అబద్ధం సృష్టించాను."

"స్వార్థం లేకుండా ఎవరూ ఇలాంటి పని చెయ్యరు!" చెప్పాడు వాయులింగం నా వంక ప్రశ్నార్థకంగా చూస్తూ.

"నిజమే. నా స్వార్థం సభాకర్‌రావు ఏకైక కోరికని ఆయన అడగకుండా తీర్చగలిగా నన్న సంతృప్తి మాత్రమే. ఆదిత్య ఆ తర్వాత నన్ను కలిసి, తనే నిజంగా సూర్యని చంపానని, కానీ తనని జైలు నుంచి విడిపించడానికి తన తండ్రి ఆ పాపభారాన్ని అనవసరంగా తనకి బదిలీ చేసుకుని, పరువు పోగొట్టుకున్నారని వలవల ఏడుస్తూ చెప్పాడు."

"కనీసం అతనికైనా ఇది కట్టు కథ అని చెప్పావా?" అడిగాడు శివనాథం.

"ఊహుఁ, లేదు."

శివనాథం ఖాళీ బ్రాందీ గ్లాసుని టేబుల్ మీద ఉంచి చెప్పాడు - "ఏలేరు స్కామ్, కరీంనగర్ స్కామ్‌లకీ, దీనికీ అసలు పోలికే లేదు. నీవు ప్రతిఫలాపేక్ష లేకుండా చేసిన చెడ్డ పని ఓ మంచి కారణం కోసం కాబట్టి పోలిక లేదన్నాను."

ఏదో ఆలోచిస్తూనే ఉన్న వాయులింగం మళ్లీ చటుక్కున అడిగాడు - "సభాకర్‌రావు తన మరణానికి ముందు నిన్ను పిలిచి ఒంటరిగా నీతో ఇంతకూ ఏం మాట్లాడాడు?"

"తనకి సంవత్సరికాలు పెట్టే వారసుడే లేకుండా పోయాడని, ఆదిత్యని ఏటా ఆ పని చేయడానికి జైలు నుంచి బయటికి వచ్చే ఏర్పాటే నేను తలచుకుంటే చేయగలనని, దయచేసి ఆ సహాయం చేసిపెట్టమని చేతులు పట్టుకుని బతిమాలుతూ కోరాడు. అంతే, అతను నాతో మాట్లాడింది."

నేను వెయిటర్ అందించిన ఆర్డర్ బుక్‌ని తీసుకుని అందులో మళ్లీ మూడు మేన్షన్ హౌస్ బ్రాందీ, రెండు సోడాలు రాసి సంతకం చేశాను.

"ఆదిత్య కిప్పుడు ఇద్దరు కొడుకులు. వాళ్ల పేరు సూర్య, సభాకర్. మొదటి కొడుకు తన భార్య ద్వారా, రెండో కొడుకు జేన్ ద్వారా!" చెప్పాను.

